# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- “అంతర్జాతీయ మహిళా దినోత్సవం” సందర్భంగా గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.
- సంస్కరణల కారణంగానే భారతదేశం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- వైద్య విద్య వృత్తి మాత్రమే కాదని.. అది సామాజిక బాధ్యత అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభివర్ణించారు.
- విశాఖపట్టణంలో ఈనెల 9న నిర్వహించనున్న నీతి ఆయోగ్ రీజినల్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ (సౌత్) ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

==========================

“అంతర్జాతీయ మహిళా దినోత్సవం” సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈ రోజు ఒక ప్రకటనలో రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో జాతీయ సమగ్రత, శాంతి, సామరస్యాన్ని కాపాడడంలో గొప్ప పాత్ర పోషించారన్నారు. మహిళలు ఎల్లప్పుడూ సమాజానికి ప్రేరణగా నిలిచారని తెలిపారు. సమాజంలో, కుటుంబ సాంప్రదాయంలో, జాతి నిర్మాణంలో మహిళలు తిరుగులేని నాయకత్వ పాత్రను పోషిస్తారని గవర్నర్ కొనియాడారు.

==========================

సంస్కరణల కారణంగానే భారతదేశం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ - అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు ఢిల్లీలో నిర్వహించిన ‘రైసినా డైలాగ్’ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని, ప్రపంచంలో ప్రతి చోటా వారు కనిపిస్తారన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ ముందుకు వెళ్తోందని, భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్‌ను అందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతమే ఉందని,

జననాలు ఎక్కువగా ఉండాలని, ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలను కూడా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

===========================

విశాఖపట్టణం జిల్లాలో చేపట్టనున్న 16వ జనాభా గణన (జనగణన–2027) ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ రోజు నిర్వహించిన మొదటి దశ “గృహాల జాబితా, గృహ వసతుల గణన”కు సంబంధించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనగణన ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పునాదిగా నిలుస్తుందని, చట్టబద్ధమైన ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. శిక్షణ సమయంలో ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకోవాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

===========================

వైద్య విద్య వృత్తి మాత్రమే కాదని.. అది సామాజిక బాధ్యత అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభివర్ణించారు. గుంటూరు వైద్య కళాశాల స్నాతకోత్సవంలో ఆయన ఈ రోజు ముఖ్య అతిథిగా పాల్గొని.. 2020 బ్యాచ్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైద్యులు రోగుల పట్ల సానుభూతి చూపాలని, ప్రేమగా వ్యవహరించాలన్నారు. పరిశోధనలపై దృష్టి పెడుతూ.. ఎప్పటికప్పుడు తయారయ్యే కొత్త మందులపై అవగాహన పెంచుకోవాలని పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

===========================

ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వం ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలో ఈ రోజు మంత్రి 116 మంది లబ్ధిదారులకు 90 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలు అధిక ఖర్చుతో కూడిన  అత్యవసర వైద్యం పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు.

విరామం

===========================

న్యాయవ్యవస్థ - చట్టాలపై ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బి.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా, కార్మిక చట్టాలు, వెట్టిచాకిరి నిరోధక చట్టాలు తదితర అంశాలపై తిరుపతిలో రాష్ట్రస్థాయి కార్యశాలను ఈరోజు నిర్వహించారు. తిరుపతితో పాటు చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.రామకోటేశ్వరరావు మాట్లాడుతూ... న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందన్నారు. కట్టుదిట్టమైన చట్టాల కారణంగా  మానవ అక్రమ రవాణాను అడ్డుకోగలుగుతున్నామన్నారు. మహిళలు, బాలికల భద్రత కోసం న్యాయ వ్యవస్థలో చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

విశాఖపట్టణంలో ఈనెల 9న నిర్వహించనున్న నీతి ఆయోగ్ రీజినల్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ (సౌత్) ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు, అండమాన్ & నికోబార్ దీవుల నుంచి అధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నందున అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విమానాశ్రయంలో ప్రతినిధుల స్వాగతానికి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వారికి రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అలాగే కార్యక్రమం నిర్వహించే వేదిక వద్ద శుభ్రత, భద్రత, ప్రథమ చికిత్స, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కంట్రోల్ రూమ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

===========================

మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నం పోలీస్ పెరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థినిలకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరు గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు విద్యార్థులతో మాట్లాడారు. పోలీసు వ్యవస్థ పనితీరు, శాంతి, భద్రతలను కాపాడేందుకు చేపట్టే చర్యలను, పలు చట్టాల గురించి వివరించారు.

===========================

ఏకీకృత కుటుంబ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు మండలాల వారీగా ఆయన ఈ సర్వేపై సమీక్షించారు. సర్వేలో వెనుకబడిన మండలాల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తాగు నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ అధికారులకు సూచించారు. ఉపాధి పనులలో లక్ష్యాలను చేరుకోవాలని, 100 రోజుల పని దినాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

===========================

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ధవళేశ్వరంలో ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్య, ఉత్తమ వ్యక్తిత్వం, నిరంతర కృషి ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించవచ్చునని అన్నారు.

===========================

పేదలకు న్యాయ సేవలు సులభంగా అందించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు కాకినాడ 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. ఆనంది స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి లాంఛనంగా ప్రారంభిచారు.

===========================
===========================